

# రక్తం కార్చే దయ్యం

## గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

**"రక్షించాలి,** పంతులుగారూ!"

"చెప్పండి, మాస్టారూ!"

"మాది పెంకుటిల్లండి. రోజూ రాత్రివేళ నడికప్పు నుంచి సావిట్లోకి రక్తం పడుతూందండి."

"వూఁ."

"దయ్యమేమో నని అనుమానం. అనుమానమేంటి, భాయమే నండి. ఖాళీ చేద్దామంటే కొంప ల్లేవు."

"ఏం చేశారు?"

"భూత వైద్యుల్ని —అదే—వేన్ సాయబు గార్నీ, సీతయ్య గార్నీ, స్వస్థత ప్రార్థనల్ల చేసే లివింగ్‌స్టన్ గార్నీ పిలిపించామండీ. వాళ్ళు చెయ్యమన్న వన్నీ చేశాం. చెయ్యాలనుకున్న వన్నీ వాళ్ళు చేశారు. ఫలితం ఏమాత్రమూ లేదండీ."

"రక్తం ధారగా పడుతూందా, చుక్కలుగానా?"

"చుక్కలే."

"ఏవేళప్పుడు పడుతున్నాయి?"

"చెప్పలేక పోతున్నాం. ఏమయినా అర్ధరాత్రి పన్నెండూ రెండు గంటల మధ్యేనండి."

"చుక్కలు పడుతూండగా మీ రెప్పుడయినా చూశారా?"

"చూడలేదండి. చూడాలని చాలాసార్లు మేలుకుని కూర్చున్నాం. కూర్చున్నంత సేపూ పడలేదు. పడుకోగానే పడ్డయండి. రాత్రంతా మేలుకుని కూర్చున్న రోజున అసలు పడలేదు."

"శబ్దం వినిపిస్తుందా?"

"ఏమీ వినిపించదు."

"బయటినుంచి చూశారా?"

"చూశామండి. ఏమీ లేదు."

"మీరు పిల్లుల్ని పెంచుతున్నారా?"

"లేదండి. పిల్లులంటే మా ఆవిడకి ఒళ్ళుమంట."

"మీ కెవరైనా విరోధు లున్నారా?"

"ఉన్నారా అంటే...ఉంటే...ఉండొచ్చుండి. ఉన్నారండి."

"ఎవరు? ఏ రకమైన విరోధం?"

"నేను పూర్వం అద్దెకున్న ఇంటి యజమానండి. వాళ్ళ పిల్లి ఒకసారి మా ఇంట్లో కొచ్చి పాలు పారబోస్తే మా ఆవిడ, 'వెధవ పిల్లి' అన్నది. రాయన ఇంటాయన నొచ్చేసి, 'అంటే నేనూ వెధవనేగా?' అని అందుకున్నాడు. మా ఆవిడ రెచ్చిపోయి ఆ రాత్రి ఆ పిల్లి ముక్కుకిఅమృతాంజనం పూసింది ఇహ ఆయన శివమెత్తి పోయాడు. మమ్మల్ని అంతు చూడకపోతే తను మగాణ్నే కానని శపథం చేసేశాడు. పొద్దున్నే నేను ఈ ఇంట్లోకి మారాను."

"ఇది జరిగి ఎంత కాలమైంది?"

"రెండు వారాలు."

"ఆయన దైవ భక్తుడా? మంత్రోపాసకుడా?"

"భక్తీ లేదు, పిండాకూడూ లేదు. కానీ ఎవడ్నో ఆశ్రయించా డనుకుంటున్నాం. మెడలో రుద్రాక్షమాలలతో గడ్డాలూ మీసాలూ పెంచిన వాడొకడు రోజుకోసారి మా కొత్తింటి గుమ్మంలో కొచ్చి తిరిగి పోతున్నట్టు గమనించాం."

"అట్లాంటప్పుడు నే నొచ్చి ఏం చెయ్యగల్ను? నేను క్షుద్రమంత్రోపాసకుణ్ణి కాను. ఏదో గాయత్రి చేసుకుని తృప్తి పడేవాణ్ణి. ప్రతి విషయాన్నీ దయ్యాలతో ముడి పెట్టడం నాకు చిరాకుకూడా. నాకూ, మీ పాత ఇంటాయనకూ లేనిపోని తగాదా ఎందుకు?"

"అహాహా అట్లా అనకండి. ఆ గాయత్రే మీకు ఏదో మార్గం చూపిస్తుందని అందరూ అనుకుంటూంటారు. బాబ్బాబూ, మీ రాదు కోకపోతే లాభం లేదు. మేమందరం హడిలి చస్తున్నాం. తుమ్మొచ్చినా దగ్గొచ్చినా ఆ దయ్యమే కారణమని భయంకరంగా వణికి పోతున్నాం. మీరోసారి రాక తప్పదు. మీరు కోరినంత ఇస్తాను."

"నా మంత్రాలు డబ్బుకు పనిచేసేవి కావు. మనిషికి మనిషి సహాయమనేదే నా తాత తండ్రులు నేర్పింది. రాత్రికి వస్తానులెండి.

• • •

"మాస్టారూ, పన్నెండయింది—ఇదిగో లైటార్పేశాను. ఇక్కడే నానా విభూతి బుర్రతో కూర్చున్నాను. మీ రంతా బయటుండండి. పనవ్వగానే తలుపు తీసి పిలుస్తాను."

• • •

"మాస్టారూ, నిద్ర పోతున్నారా? లేవండి. నా మీద రక్తం పడింది. చీకట్లో నిచ్చె నెక్కి కాగితాన్ని మిఠాయి పొట్లం చేసి దాంతో నా విభూతిని అక్కడ పైకప్పులో పూదాను. దయ్యం టక్కున కింద పడింది. చూస్తారా? ఇదుగో ఇటు... ఇటు...ఈ మూల..."

"అఁ, గబ్బిలమా! మరిరక్తమో?"

"ఎలికదో పిచ్చుకదో అయ్యుంటుంది. పైకప్పెక్కి పెంకుల్లో వెతకండి. మరి నా విభూతి, అదే గమాక్సిన్ ఖర్చు పావలా రేపొద్దున సాంబయ్య కొట్లో అప్పు తీర్చెయ్యటం మరిచి పోకండి. వస్తాను." ●